# ఎంబీబీఎస్ ఉత్తీర్ణతే సరిపోదు!

- నాడి పట్టాలంటే మరో పరీక్ష ఎదుర్కోవాలి
- జాతీయ స్థాయిలో వైద్యవిద్యకు ఒకే పాఠ్య ప్రణాళిక
- నీతి ఆయోగ్ కీలక సిఫార్సులు

ఈనాడు, హైదరాబాద్: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైతే ప్రస్తుతం వైద్యవృత్తి చేసుకోవచ్చు లేదా పీజీ వైద్యవిద్య చదువుకోవచ్చు. ఇకపై ఎంబీబీఎస్ పట్టా పొందినంత మాత్రాన స్టెతస్కోప్ పట్టుకొని చికిత్స చేసేస్తామంటే కుదరకపోవచ్చు. ఎంబీబీఎస్ అయ్యాక వృత్తిలో చేరాలంటే జాతీయ స్థాయిలో మరో అర్హత పరీక్షలో ఉత్తీర్ణులవ్వాల్సిందే. దేశంలో వైద్యవిద్య ప్రక్షాళనపై నీతి ఆయోగ్ ఇటీవల ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పొందుపర్చిన పలు సిఫార్సుల్లో ఇది కీలకమైంది. ప్రస్తుతమున్న భారతీయ వైద్య మండలి (ఎంసీఐ)ని రద్దు చేసి, ఆ స్థానంలో జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసీ)ని తీసుకురావాలని కూడా నీతి ఆయోగ్ ముసాయిదా బిల్లులో సిఫార్సు చేసింది. దేశంలో వైద్య కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలపై ఆందోళన వ్యక్తం చేసిన నీతి ఆయోగ్.. తన సిఫార్సుల్లో వైద్యవిద్యార్థుల ప్రతిభాపాటవాలను అంచనా వేయడానికి మరో అర్హత పరీక్ష అవసరమని స్పష్టంచేసింది. ఎంబీబీఎస్ వైద్యవిద్య అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష (ఎన్ఎల్ఈ)లో ఉత్తీర్ణులవ్వాల్సి ఉంటుంది. ఎన్ఎల్ఈలో సాధించిన ర్యాంకుల ఆధారంగానే పీజీ వైద్యవిద్యలోనూ సీట్లు పొందడానికి వెసులుబాటు ఉంటుంది. తాజా సిఫార్సుల ప్రకారం.. ఎంబీబీఎస్ పూర్తయిన వైద్యులు పీజీలోకి వెళ్లాలన్నా, వైద్యవృత్తిలోకి అడుగుపెట్టాలన్నా ఎన్ఎల్ఈలో ఉత్తీర్ణత సాధించాలి. ఇది జాతీయ స్థాయి అర్హత పరీక్ష కాబట్టి దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా వైద్యవృత్తిని ప్రారంభించడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

## మరికొన్ని సిఫార్సులు..

- ✦ దేశంలోని సుమారు 450 వైద్యకళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, ఒకే తరహా పాఠ్యప్రణాళిక అమలుచేయడం దీని ప్రధాన ఉద్దేశం.
- ✦ అర్హత పరీక్ష తప్పనిసరి చేస్తే.. వైద్యకళాశాలల్లో బోధనా ప్రమాణాలు మెరుగవుతాయి. వైద్యవిద్యార్థులను నిరంతరం అంచనా వేస్తారు.
- ✦ ఒకే పాఠ్యప్రణాళిక ఉన్నా.. స్థానిక సామాజిక అవసరాలకు తగ్గట్లుగా రాష్ట్రాల్లో స్వల్ప మార్పులు చేసుకోవచ్చు.
- ✦ వైద్య కళాశాలల పనితీరును బేరీజు వేసుకుంటూ ర్యాంకులిస్తారు.
- ✦ వైద్యవిద్యార్థులు, వైద్యులందరి నమోదుప్రక్రియను జాతీయ స్థాయిలో ఆధార్ సంఖ్య ప్రాతిపదికన నిర్వహిస్తారు.

## ఇప్పటిదాకా విదేశీ వైద్యవిద్యకే..

విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించిన విద్యార్థులు మన దేశంలో పీజీ వైద్యవిద్యలోకి అడుగుపెట్టాలన్నా.. వైద్యవృత్తిని చేపట్టాలన్నా తప్పనిసరిగా ఎంసీఐ నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులవ్వాల్సి ఉంటుంది. తాజాగా నీతి ఆయోగ్ సిఫార్సులతో ఇప్పుడు మనదేశంలో ఉత్తీర్ణులైన ఎంబీబీఎస్ వైద్యవిద్యార్థులు కూడా అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

18-August-2016
Thursday

www.medicoabroad.in
+91-9959114545